
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కొనేవారేరీ?



- పొగాకు రైతుల ఆశలకు పొగ
- ఒప్పందం మేరకు ముందుకు రాని కంపెనీలు
- పీకల్లోతు కష్టాలతో... ఆందోళనలో రైతులు
- ఉమ్మడి జిల్లాల్లో భారీగా పెరిగిన సాగు
- ఆందోళనలు చేస్తున్న రైతు సంఘాలు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): పొగాకు కంపెనీల మాయాజాలంలో రైతులు మరోసారి నష్టపోయారు. అధిక ధర సాకు చూపుతూ రైతులను మభ్యపెట్టి వారితో ఒప్పందం కుదుర్చుకోవడం, తీరా పంట చేతికొచ్చిన తర్వాత ఇష్టారాజ్యంగా కొనుగోళ్లు చేయడంతో ఈ ఏడాది రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పొగాకు కంపెనీలు రైతులతో కుదుర్చుకున్న ఒప్పంద పత్రాలను కూడా రైతుల చేతుల్లో కాకుండా వారి బలహీనతను ఆసరా చేసుకుని పలు కంపెనీలు వారి వద్దనే ఉంచుకుని దగాకు పాల్పడుతున్నాయి. పొగాకు రైతులు ఎట్టిపరిస్థితుల్లోనూ నష్టపోకూడదని, నాణ్యత ఆధారంగా బర్లీ పొగాకును కంపెనీలు తప్పకుండా సేకరించాలని, పొగాకు నిల్వలు అలాగే ఉండకూడదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయాధికారులు, అటు కంపెనీలను ఆదేశించినా పొగాకు కంపెనీల్లో కదలిక లేదని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● పెరిగిన పంట సాగు

గత ఏడాది పోలిస్తే కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అత్యధికంగా పొగాకు పంట విస్తీర్ణత ఈ ఏడాది పెరిగింది. 2023-24 సంవత్సరంలో నంద్యాల జిల్లాలో 2,858 హెక్టార్లలో పొగాకు వేయగా ఈ 2024-25 సీజన్‌లో 6,886 హెక్టార్లలో పంట సాగుచేశారు. అమాంతంగా 135 శాతం పెరిగింది. కర్నూలు జిల్లాలో గత ఏడాది 2,830 హెక్టార్లలో పంట వేయగా ఈ ఏడాది 5,984 హెక్టార్లలో పంటను సాగుచేశారు. ఈ ఏడాది 11,451 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. సాగు అమాంతంగా రెండు రెట్లు కావడంతో పొగాకు కొనుగోలుదారులు అయోమయంలో పడ్డారు. రైతుల నుంచి అరకొరగా కొనుగోలు చేయడం, తడిగా ఉందంటూ, నాణ్యత లేదంటూ సాకులు చెప్పి వెనక్కు పంపుతున్నారు. దీంతో రైతులకు పొగాకు భారంగా మారింది. నంద్యాల జిల్లాలో స్థానికంగా చుక్కబర్లీ, బ్యార్నీబర్లీ పొగాను అత్యధికంగా సాగుచేస్తున్నారు. నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పాములపాడు, మిడ్తూరు, ఆత్మకూరు, పాణ్యం వంటి ప్రాంతాల్లో చుక్కబర్లీ, మహానంది, గడివేముల, బండిఆత్మకూరు, నంద్యాల మండలాల్లో బ్యార్నీబర్లీ పొగాకు రకాలను అత్యధికంగా పండిస్తున్నారు. కంపెనీలు గత 15 రోజుల క్రితం వరకు చుక్కబర్లీని స్థానికంగానే రూ.12వేల నుంచి 15వేల వరకు, బ్యార్నీబర్లీని రూ.15వేల నుంచి 17వేల వరకు కొనుగోలు చేశాయి. తీరా పంట అధికం కావడంతో చేతులెత్తేశాయి. అప్పుడు, ఇప్పుడు అంటూ రైతులకు చుక్కలు చూపిస్తున్నారు.

మంత్రులు, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవాలి



పొగాకు రైతుల సమస్యను పరిష్కరించాలని మూడు వారాలుగా ఆందోళన చేస్తున్నా మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం దారుణం. పొగాకు రైతులను ఆదుకోవాలని స్వయంగా ముఖ్యమంత్రి ఆదేశించినా మిన్నకుండడం మంచి పద్ధతి కాదు. ఇప్పటికైనా పొగాకు రైతులను ఆదుకోవాలని కోరుతున్నాము. కంపెనీలు దిగివచ్చి వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలి.

- రాజశేఖర్, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు



తడిసి ముద్దయిన పొగాకు

● మిర్చిలో నష్టమే... పొగాకులో నష్టమే...



ఈ ఏడాది నాలుగు ఎకరాల్లో మిర్చి పంట వేసి సరైన ధర లేక నష్టపోయాను. ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని పొగాకు వేస్తే పంట చేతికొచ్చినాక కొనేవారు లేరు. రెండు పంటల్లో నష్టం వాటిల్లింది. రైతు పరిస్థితి దారుణంగా ఉంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- బ్రహ్మేశ్వరరెడ్డి, నెరవాడ, పాణ్యం మండలం

● 60 క్వింటాళ్లు దిబ్బలో వేయమన్నారు



ఏడు ఎకరాల్లో పొగాకు వేసి, కుటుంబమంతా కష్టపడి పండించాము. పంట చేతికి వచ్చిన తర్వాత జీపిఐ కంపెనీ కొనుగోలు చేయడం ఆలస్యం చేసింది. ఒకరోజు భారీవర్షంతో కొంతమేర తడిచింది. దాన్ని మళ్లీ ఎండబెట్టుకుని 60క్వింటాళ్లు కంపెనీకి తీసుకెలితే దిబ్బలో వేయమన్నారు. దీంతో చేసేదేమిలేక వెనక్కుతీసుకొచ్చాను. మా కుటుంబం రోడ్డున పడకుండా ప్రభుత్వమే ఆదుకోవాలి.

- మౌలాలి, చౌట్కూరు, మిడ్తూరు మండలం

● 500 క్వింటాళ్లు నిలిచిపోయింది



60 ఎకరాల్లో పొగాకు పంటను సాగు చేశా. సుమారు 500 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అలయెన్స్ కంపెనీ ఒప్పందం మేరకు తాను ఎకరాకు 25వేల కౌలుతో 55 ఎకరాలు తీసుకుని, దాంతో పాటు నాకున్న ఐదు ఎకరాల సొంత భూమిలో కూడా పొగాకు పంటను వేశాను. పెట్టుబడి సుమారు రూ.70 లక్షల మేర వచ్చింది. అప్పులు చేసి పంటను పండించాను. తీరా పంట చేతికొచ్చిన తర్వాత కంపెనీ కొనుగోలు చేయడానికి ముందుకు రాలేదు. కంపెనీ కొనుగోలు చేయకపోతే తీవ్రంగా నష్టపోతాను. కలెక్టర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పంటను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాను.

- మద్దిలేటి, కరివేన, ఆత్మకూరు మండలం

● మా పరిస్థితి దయనీయంగా ఉంది



ఆరు ఎకరాల్లో పొగాకు వేయగా సుమారు 80 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. సుమారు రూ.8లక్షల మేర పెట్టుబడి పెట్టి పంటను పండించా ము. కంపెనీలు కొనుగోలుకు ముం దుకు రాకపోతే మా పరిస్థితి దయనీయంగా మారుతుంది. ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాము. మాకు కలెక్టర్ న్యాయం చేయాలి.

- నాగేశ్వరరెడ్డి, పాములపాడు

● కంపెనీలతో చర్చిస్తున్నాం



పొగాకు కంపెనీల ప్రతినిధులతో చర్చిస్తున్నాం. తప్పకుండా పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకుంటాం. రైతులందరికీ న్యాయం జరిగేలా చేస్తాం. ఎవరూ ఎలాంటి ఆందోళన చెందవద్దు.

- మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

ఇంధనం..!

- మున్సిపాలిటీలో డిజిల్ దందా?
- నంద్యాలలో నెలకు రూ.11 లక్షలు ఖర్చు
- కమీషన్లకు పాల్పడుతున్న అధికారులు
- వాహనాలు తిరిగినట్లు రాసుకుంటున్న వైనం



శ్రీనివాస నగర్‌లోని పురపాలక గ్యారేజీలో ఉన్న వాహనాలు

నంద్యాల టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలో ప్రధానమైనది పారిశుద్ధ్యం విభాగం. కానీ అందులో అధికారులు, నాయకులు కలిసి డిజిల్ దందా చేస్తున్నారు. దీంతో నంద్యాల పురపాలక సంఘంలో ఇదే తీరు కొనసాగుతుందని ఇటీవల సీడీఎంఏ సంపత్‌కుమార్ పురపాలక అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఇదిలా ఉంటే వారి తీరు మాత్రం ఏ విధంగా మారడం లేదు. దీంతో ప్రభుత్వానికి గండి పడే విధంగా నంద్యాల పురపాలక సంఘం అధికారుల వ్యవహారం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ట్రిప్పులు ఎక్కువగా తిరగకపోయిన తిరిగినట్లు రాసుకుని ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. నంద్యాల పట్టణంలో 42 వార్డులు ఉన్నాయి. నెలకు డిజిల్ ఖర్చు సుమారుగా రూ.11 లక్షల నుంచి రూ.13 లక్షల వరకు చేస్తున్నారు. సుమారుగా 3 లక్షల జనాభా ఉంది. రోజుకు 60 మెట్రిక్ టన్నుల చెత్తను తరలిస్తున్నారు. గతంలో చెత్త తరలింపు వాహ నాలకు రిడింగ్ మీటర్లు ఉండేవి వాటి వల్ల అదనంగా రాసుకోవడానికి వీలు ఉండదు. దీన్ని భావించిన కొందరు అధికారులు వాటిని తొలగించి పాత పద్ధతిలోనే వారికి నచ్చినట్లు రాసుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నంద్యాల పురపాలక సంఘంలో మొత్తం 23 వాహనాలు ఉన్నాయి. వీటిలో అనుభవంలో 20 వాహనాలు మిగిలినవి మైనర్ మరమ్మతుల వల్ల తిరగడం లేదు. కానీ పట్టణంలో రోజు ఉదయం చెత్తను తరలిస్తున్నారు. ఉదయం సాయంత్రం తరలిస్తున్నట్లు రాసుకుని డిజిల్ ఖర్చు అయిందని బిల్లులు పెట్టుకుంటున్నారు. పట్టణంలో ఎక్కడ కూడా సాయంత్రం వేళ చెత్తను తరలించడం లేదని ప్రజలే చెబుతున్నారు. అలాగే పట్టణ శివారుల్లో వైఎస్‌నగర్, నందమూరి నగర్, రైతు నగరం వంటి ప్రాంతాల్లో సాయంత్రం తరలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ అక్కడ కూడా రెండు రోజుల ఒక్కసారి తీసుకెళ్తున్నారు. దీంతో తిరగకపోయిన తిరిగినట్లు రాసుకుంటున్నారు.

అసలు సూత్రధారులెవరో?

ఈ డిజిల్ దందాలో ఎంత వరకు అక్రమాలు జరిగాయి. సూత్రధారులెవరు..? పాత్రధారులెవరు...? ఎంత మేర బిల్లులు చెల్లించారో అని ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఇందులో పురపాలక సంఘంలోని ఓ కీలక అధికారి దగ్గరి నుంచి పారిశుద్ధ్యం విభాగంలో పని చేసే అధికారుల వరకు ఈ డిజిల్ దందాలో భాగం ఉన్నట్లు బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విచారించి చర్యలు తీసుకుంటాం

ఫిర్యాదులు వస్తే విచారించి చర్యలు తీసుకుంటాం. అలాగే మేము కూడా విచారణ జరిపించి నివేదికలు ఉన్నతాధికారులకు పంపించి శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. చెత్త తరలింపు పద్ధతి ప్రకారమే జరుగుతుంది. ఎక్కడైనా చెత్త సేకరణ సరిగా జరగకపోతే వారిపై ఫిర్యాదు చేయండి. చర్యలు తీసుకుంటాం.

- వెంకటదాస్, అసిస్టెంట్ కమిషనర్



డంపు యార్డులో ఉన్న చెత్త (ఫైల్)

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: ఏఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ యుగంధర్‌బాబు

నంద్యాల టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని ఏఎస్పీ యుగంధర్ బాబు సూచించారు. నంద్యాలలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 67 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఏఎస్పీ నేరుగా బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరించి విచారణ జరిపి త్వరగా పరిష్కారం చూపుతామన్నారు. ఫిర్యాదులు పునరావృతం కాకూడదన్నారు. ప్రతి సమస్యను చట్ట పరిధిలో పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. ఇచ్చిన సమయంలోగా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మహిళలు ప్రయాణం చేసేప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఏ అధికారి కూడా నిర్లక్ష్యం వహించరాదన్నారు. అటువంటివారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పనితీరు మారకపోతే చర్యలు

- తహసీల్దార్లపై కలెక్టర్ కలెక్టర్ ఆగ్రహం
- పీజీఆర్ఎస్‌కు 213 దరఖాస్తులు



మహిళ ఫిర్యాదుతో చాగలమర్రి తహసీల్దార్‌ను వీసీలో మందలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): పనితీరు మారకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ రాజకుమారి హెచ్చరించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. నందికొట్కూరు మండలం దామగట్ల గ్రామానికి చెందిన విజయ్‌పాల్‌కు సంబంధించిన ల్యాండ్ క్లియరెన్స్‌లో జేసీ క్లియరెన్స్ కాపీ ఆర్డర్స్ జారీచేసినప్పటికీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ కలెక్టర్ నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళకు సంబంధించిన భూమిని ఎందుకు ఆన్‌లైన్ ఎక్కించడం లేదని చాగలమర్రి తహసీల్దార్ రవికుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే వివిధ సమస్యలపై నంద్యాల అర్బన్ తహసీల్దార్ ప్రియదర్శిని, రూరల్ తహసీల్దార్ శ్రీనివాసులుతో పాటు డోన్, ఆత్మకూరు ఆర్డీవోలు, రెవెన్యూశాఖ అధికారులు, కిందిస్థాయి సిబ్బందిపై కలెక్టర్ మండిపడ్డారు. కార్యాలయాలకు వచ్చే ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించకపోవడమే కాకుండా సమస్యను పరిష్కరించడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారంటూ ఆమె ప్రశ్నించారు. పీజీఆర్ఎస్‌కు అధికశాతంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా వస్తున్నాయని, జిల్లాలోని ఆల్ తహసీల్దార్స్ ఆర్ ఫెయిల్డ్ అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

పీజీఆర్ఎస్‌కు 213దరఖాస్తులు

నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరి హాల్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 213 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. 49 దరఖాస్తులు రీ ఓపెన్ అయ్యాయని వీటన్నింటినీ పరిష్కరించాలని ఆదేశించారు. వీటితోపాటు వీఐపీ దరఖాస్తులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 62 అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల సర్వేలలో భాగంగా మన మిత్ర క్యాంపెయినింగ్‌కు సంబంధించి ఇంకా 13,724పెండింగ్‌లో ఉన్నాయని, వర్క్‌ఫ్రం హోమ్‌కు సంబంధించి 2367పెండింగ్‌లో ఉన్నాయని, సంబంధిత సర్వేను వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏపీఈఏపీ సెట్ ప్రారంభం

నంద్యాల ఎడ్యుకేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఏపీలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఈఏపీ సెట్-2025 పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. నంద్యాల జిల్లాలో మూడు ఇంజనీరింగ్ కళాశాలల్లో ఆన్‌లైన్ పద్ధతిలో అగ్రికల్చర్, ఫార్మసీ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఇంజనీరింగ్ విభాగాల్లో ప్రవేశ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించిన మొదటి సెషన్‌లో 713 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 659 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన రెండో సెషన్‌లో 711 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 659 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తంగా 1,424 మంది విద్యార్థులకు గాను 1,318 మంది విద్యార్థులు హాజరై 92.56 శాతం హాజరు నమోదైంది.

కార్యకర్తలే ప్రాణం

- వారికోసం ప్రాణాలర్పిస్తా
- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి
- మినీ మహానాడులో భావోద్వేగానికి లోనైన మంత్రి బీసీ

కోవెలకుంట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): 'ప్రతి కార్యకర్తకూ న్యాయం చేస్తా. కార్యకర్తలే నా బలం, ప్రాణం. అందరికీ పాదాభివందనం. వారికోసం ప్రాణాలైనా అర్పించేందుకు సిద్ధంగా ఉన్నా. ఏ ఒక్కరినీ వదులుకునే ప్రసక్తే లేదు..' అంటూ రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి భావోద్వేగ ప్రసంగం చేశారు. సోమవారం కోవెలకుంట్ల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల, బనగానపల్లె మండలాల టీడీపీ శ్రేణులతో కలసి మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వైసీపీ నాయకులు ఎన్నో కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేసినా వాటిని లెక్కచేయకుండా తన వెంట నడిచిన కార్యకర్తలకు రుణపడి ఉంటానన్నారు. తన గెలుపునకు కృషి చేసిన కార్యకర్తల కోసం ప్రాణాలైనా అర్పిస్తానని అన్నారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో నియోజకవర్గంలో టీడీపీ గెలిచి తీరాలన్న ఆలోచనతో కార్యకర్తల కృషి మరువలేనిదన్నారు. కార్యకర్తల కృషి ఫలితంగానే తనకు మంత్రి పదవి వచ్చిందన్నారు. తాను మంత్రిని కాదని ప్రజలకు సేవ చేసే వ్యక్తినన్నారు. 2009లో మాయమాటలతో అధికారంలోకి అధికారంలోకి వచ్చిన వైసీపీ రాష్ట్రాన్ని నాశనం చేసిందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో టీడీపీ కార్యకర్తలు ఎన్నో కష్టాలకు గురయ్యారన్నారు. నాడు టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేసిన త్యాగం వల్లే నేడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నెలకొందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ప్రతిపక్షంలో ఉండగా కష్టపడ్డ ప్రతి కార్యకర్త, నాయకుడి కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మీడియా ప్రతినిధి కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, నాయకులు బీవీ ప్రసాద్‌రెడ్డి, గువ్వల సుబ్బారెడ్డి, గడ్డం నాగేశ్‌రెడ్డి, టంగుటూరు శీనయ్య, అంబాల ప్రభాకర్‌రెడ్డి, నంద్యాల రమేశ్‌రెడ్డి, హుసేనయ్య. లక్ష్మిరెడ్డి, చల్లా విజయ భాస్కరరెడ్డి, ఉగ్రసేనా రెడ్డి, కిరణ్‌కుమార్, పేరుసాముల సురేశ్‌రెడ్డి, బత్తుల ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, నాయకులు

రమణీయం.. లక్ష్మమ్మ అవ్వ రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

● జనసంద్రమైన ఆదోని ● దర్శించుకున్న ప్రముఖులు

ఆదోని , మే 19 (ఆంధ్రజ్యోతి): మల్లిసంధ్య లేలేత కిరణాలతో సూర్య భగవానుడు ఆశీర్వదించగా పండితులు వేదమంత్రాలు వల్లిస్తుండగా శుభకర మంగళ వాయిద్యాలతో ఉత్సవమూర్తి మహాయోగి లక్ష్మమ్మ అవ్వను పరిమళపూలతో ప్రత్యేకంగా అలంకరించిన వెండి రథంపై ఆశీనులు గావించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అవ్వ రథోత్సవం కన్నులారా తిలకించేందుకు భక్తజనం వెయ్యికళ్లతో ఎదురుచూస్తుండగా శుభ ముహూర్తం సాయంకాల సంధ్యావేళ 3.00 గంటలకు మహారథం చక్రాలు కదిలాయి. ఒక్కసారిగా జయహో లక్ష్మాంబికాదేవి జయహో జయహో లక్ష్మమ్మ అవ్వ జయహో అంటూ అవ్వ నామ స్మరణంతో పురవీధులు భక్తితత్వంతో ప్రతిధ్వనించాయి. ఆధ్యాత్మికత శోభిల్లింది. ఆదోని పట్టణంలో సోమవారం మహాయోగి లక్ష్మమ్మవ్వ జాతర మహోత్సవం, వెండి మహారథోత్సవం కన్నుల పండుగగా సాగింది. బ్రాహ్మణ వీధి నుంచి ప్రారంభమైన అవ్వ రథోత్సవం హవన్న పేట కూడలి, బుడ్డేకల్ సర్కిల్, పూల బజార్, షరాఫ్ బజార్ మీదుగా సాగి యథాస్థానం చేరుకోవడంతో ఉత్సవం ముగిసింది. అడుగడుగునా భక్తులు అవ్వ రథానికి టెంకాయలు సమర్పించి పూజలు చేశారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో పురవీధులు జన సందోహంగా మారాయి. ఎటు చూసినా జాతర కోలాహలమే.

ప్రత్యేక పూజలు

ఆరాధన, జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని మహాయోగి లక్ష్మమ్మ అవ్వ మూల బృందావనానికి కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెచ్చిన పరిమళాలు వెదజల్లే ప్రత్యేక పూలతో అలంకరించారు. ఉదయం ఐదు గంటలకే అవ్వను దర్శించుకుని మోక్ష ప్రాప్తి పొందేందుకు జిల్లా నలుమూలల నుంచి కాకుండా కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు నుంచి పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చారు. పెద్ద ఎత్తున బారులు దీరారు. ఉత్సవాల సందర్భంగా అవ్వకు అభిషేకం, ఆకుల పూజలు, కుంకుమార్చన, బిల్వార్చన, మహా మంగళ హారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య ఆధ్వర్యంలో ఉత్సవాలు సాగాయి. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అవ్వ ఆలయం చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేవిశెట్టి ప్రకాష్, డీఎస్పీ హేమలత అవ్వను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులకు పట్టణంలో ప్రతిచోట అన్నదానంతో పాటు మజ్జిగ, తాగునీటిని ఏర్పాటు చేశారు. ముందుగా లక్ష్మమ్మ అవ్వ పుట్టినిల్లు అయిన ముసానహళ్లి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పల్లకి ద్వారా భజనలతో ఆలయం చేరుకొని పూజలు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని డీఎస్పీ హేమలత ప్రారంభించారు.

నూతన జంటలే అధికం

లక్ష్మమ్మ అవ్వను దర్శించుకునేందుకు కొత్తగా పెళ్లయిన వందలాది జంటలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి కలశం చూసిన తర్వాతే ఏ శుభకార్యానికైన వెళ్ళవచ్చనేది నానుడి. కలశం చూడకుండా ఏ కార్యానికి పాల్గొనడానికి వీలుండదని పెద్దలు చెబుతున్నారు. దీంతో పెద్ద ఎత్తున తరలివచ్చి కలశం చూసిన అనంతరం అవ్వ సన్నిధిలో పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



కలశాలతో మహిళలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మమ్మ అవ్వ

పోలీసులు భారీ బందోబస్తు

లక్ష్మమ్మ అవ్వ జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా డీఎస్పీ హేమలత పర్యవేక్షణలో సీఐలు శ్రీరామ్, రాజశేఖర్ రెడ్డి, రామలింగమయ్య, ఆస్పరి సీఐ మస్తాన్ వలి, ఎస్సై, పోలీసులతో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎక్కడికక్కడే బారికేడ్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను మళ్ళించారు.

డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. 2015-18 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులకు ఇటీవల స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. ఆ ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. ఈ సమాధాన పేపర్ల రీవాల్యుయేషన్ కోసం ఈనెల 30లోపు తగిన రుసుం చెల్లించి ఆయా కళాశాలల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

'జియో మైసూర్' 595.67 ఎకరాలు

● గత కేటాయింపుల్లో 164.02 ఎకరాలు తొలగింపు

కర్నూలు అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): జియో మైసూర్ సర్వీసు ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 595.676 హెక్టార్ల భూమికి 30 ఏళ్ల లీజులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని తుగ్గలి మండలంలోని జొన్నగిరి, గోంతలపల్లి, పగిడిరాయి, వై.ఎర్రగుడి గ్రామాల్లో బంగారు, వెండి, సీసం, జింక్ ఖనిజాల తవ్వకాలు, శుద్ధి కోసం అనుమతులు మంజూరు చేసింది. గతంలో 597.820 హెక్టార్లు కేటాయించగా అందులో సరైన పద్దతిలో కేటాయించలేదన్న ఫిర్యాదు మేరకు డీజీపీఎస్ సర్వేల్లో తేడాలు రావడంలో 164.02 ఎకరాల భూమిని తొలగించారు. రెవెన్యూ, గనుల శాఖ అధికారుల తనిఖీల తర్వాత మైనింగ్ లీజులో మార్పులు చేస్తూ మౌలిక ప్రమాణాలు పాటించాలన్న నిబంధనలతో ఆదేశాలు జారీ అయ్యాయి. 2023లో కంపెనీ ప్రతినిధులు కొంత భూమి వివరాలు సరైన పద్దతిలో లేవని పేర్కొనడంతో కొత్తగా చేసిన సర్వే ప్రకారం కొంత భూమిని తొలగించినట్లు మైనింగ్ అండ్ జియోలాజికల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

22న హనుమజ్జయంతి వేడుకలు

కర్నూలు కల్చరల్, మే 19(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 22న హనుమజ్జయంతి సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ఐదు ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వేంకట రెడ్డి తెలిపారు. సోమవారం ఆయా ఆలయాల వద్ద హనుమజ్జయంతి నిర్వహణ వివరాలు తెలియజేసే బ్యానర్లు ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఓర్వకల్లులోని అంజనేయ స్వామి దేవస్థానం, హోళగుందలోని ఆంజనేయస్వామి దేవాలయం, గోనెగండ్లలోని సీతారామాంజనేయ స్వామి దేవస్థానం, నందికొట్కూరులోని రామాలయం, జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



నందికొట్కూరు శ్రీరామాలయంలో బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, భక్తులు

● నగర శివారులో డోన్ రోడ్డులోని లక్ష్మీపురం సమీపంలోని జగన్నాథగట్టుపై వెలసిన అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 22న హను మజ్జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు జగన్నాథగట్టు అభివృద్ధి కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో తెలి పారు. 22న ఉదయం 8 గంటలకు స్వామి వారికి పంచామృతా భిషేకాలు, హనుమాన్ చాలీసా పారాయణం, సీతారాములకు విశేష పూజలు ఉంటాయని మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు.

నేటి నుంచి జిల్లాలో భారీ వర్షాలు

ఎమ్మిగనూరు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పారు. అలాగే 35కి.మీ. నుంచి 40 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయన్నారు. రైతులు ఐదు రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు, రైతులు ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో బయటకు రావడం గానీ, చెట్లకిందకు వెళ్లడం గానీ చేయొద్దని సూచించారు.

'యోగాంధ్ర'ను జయప్రదం చేయండి

- కలెక్టర్‌ను ఆదేశించిన సీఎస్

కర్నూలు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'యోగాంధ్ర-2025' వేడుకలను 21వ తేదీ నుంచి ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్‌ను ఆదేశించారు. సోమవారం సెక్రటేరియట్ నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లు, స్టేట్ ప్రాజెక్టు మానిటరింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, కోర్టు సముదాయాలలో మరుగుదొడ్ల నిర్మాణం, ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయం అంశాలపై చీఫ్ సెక్రటరీ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 21న యోగా దినోత్సవం కర్టెన్ రైజర్‌గా ప్రతి జిల్లాలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి మండలంలోనూ మాస్టర్ ట్రైనర్లను గుర్తించాలన్నారు. మే 21 నుంచి 27 వరకు జిల్లా స్థాయిలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఉంటుందన్నారు. మే 28 నుంచి జూన్ 3 వరకు మండల స్థాయిలోనూ, జూన్ 4 నుంచి జూన్ 16 వరకు గ్రామ స్థాయిలో ట్రైనర్లకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

సాధారణ బదిలీలు చేపట్టండి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల మేరకు నిబంధనలను అనుసరించి జిల్లా అధికారులు తమ పరిధిలోని ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సాధారణ బదిలీలు, స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర తదితర కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమ వివరాలను ఎప్పటికపుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జూన్‌లో నీరు - మీరు అనే అంశంతో పల్లెపుష్కరిణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

నివారణకు టీకా ఒక్కటే మార్గం

తట్టు, రూబెల్లా వ్యాధి నివారణకు టీకా వేయించుకోవడం ఒక్కటే మార్గమని కలెక్టర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నేషనల్ జీరో మిజిల్స్ - రూబెల్లా ఎలిమినేషన్ క్యాంపెయిన్ కార్యక్రమం 2025-26నిర్వహించారు.

ఉత్పత్తులను కొనుగోలు చేయండి

మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలచే తయారు చేసి విక్రయిస్తున్న ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైస్టోర్ యాప్‌లో విక్రయిస్తున్న ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో ఓపెన్‌చేసి జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు.

అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. రానున్న మూడురోజుల్లో జిల్లాలో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల, జిల్లా కార్యాలయాల్లో 24గంటలు కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు కిందిస్థాయి యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు.

ఆర్డీఎస్ ఆనకట్టకు పోటెత్తిన వరద

కోసిగి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తుంగభద్ర నదిలో నీరులేక నది మొత్తం రాళ్లు తేలి ఇసుకతిన్నెలు కనిపించేవి. అయితే ఐదు రోజుల నుంచి పశ్చిమ ప్రాంతంతో పాటు ఎగువ ప్రాంతమైన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు కోసిగి మండల పరిధిలోని అగసనూరు సమీపంలో ఉన్న తుంగభద్ర నదిపై ఎగువన ఉన్న ఆర్డీఎస్ (రోజోలిబండ డైవర్షన్ స్కీం)కు వరద పోటెత్తింది. సోమవారం తుంగభద్ర నదిలో ఆర్డీఎస్ ఆనకట్టు మీదుగా వరద నీరు దిగువకు పరవళ్లు తొక్కుతుండటం, వర్షాకాలం ముందే తుంగభద్ర నదికి జలకళ సంతరించుకోవడంతో నదితీర గ్రామాల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో నదికి నీరు చేరేది. ఈ ఏడాది మేనెలలోనే వరద పోటెత్తడం గమనార్హం.



ఆర్డీఎస్ ఆనకట్టపై పొంగి పొర్లుతున్న వరద నీరు



ప్రవహిస్తున్న తుంగభద్ర నది



నదిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



ప్రారంభమైన పుట్టీల ప్రయాణాలు

తుంగభద్రకు జలకళ

- ఆనందంలో రైతులు, భక్తులు
- తాగునీటి కష్టాలు తీరాయన్న అధికారులు
- మంత్రాలయం వద్ద 308.300 నీటి మట్టం నమోదు

మంత్రాలయం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య ఉన్న తుంగభద్ర నది వేసవిలో జలకళ సంతరించుకుంది. ఆదివారం రాత్రి వరకు ప్రవాహం లేని తుంగభద్ర నది సోమవారం ఉదయానికల్లా ప్రవాహం నిండుగా ప్రవహిస్తూ అందరినీ ఆశ్చర్యపరిచింది. కర్ణాటకలోని గంగావతి, సిరిగుప్ప, సిందనూరు, మాన్వి, హగరిలో కురిసిన వర్షాలకు తుంగభద్ర నదిలోకి వంకలు, వాగుల ద్వారా వరద వచ్చి చేరుతోంది. వేసవిలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులున్న పరిస్థితుల్లో రెండు మీటర్లకు పైగా నదిలో నీటి ప్రవాహం ఉండటంతో తాగునీటికి ఇబ్బందులు తీరినట్లయింది. సోమవారం సాయంత్రం 5 గంటలకు మంత్రాలయం వద్ద 308.16 మీటర్ల నీటి మట్టంతో 17,300 క్యూసెక్కులు నీటితో ప్రవహిస్తుంది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు 306.470 మీటర్ల నీటి మట్టంతో వెయ్యి క్యూసెక్కులు మాత్రమే ఉండేది. సోమవారం ఉదయం కల్లా 17వేలకు పైగా క్యూసెక్కులు వచ్చి చేరడంతో నదీతీర గ్రామాల్లోని రైతులు రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత మార్చి ఏప్రిల్, మే నెలల్లో నీరు లేక ఎడారిగా మారిన తుంగభద్ర జలకళను సంతరించుకోవడంతో నదీతీర గ్రామాల రైతులు ఖరీఫ్‌కు సన్నద్ధం అవుతున్నారు. రెండు రాష్ట్రాల్లోని భక్తులు మంత్రాలయానికి పుట్టీ(తెప్ప)ల ద్వారా ప్రయాణాలు సాగిస్తున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలోని కౌతాళం, కోసిగి, మంత్రాలయం, నందవరం, అలాగే సి.బెళగల్, గూడూరు, సుంకేసుల కర్నూలు వరకు తాగునీటి పథకాలు పునఃప్రారంభమయ్యాయి.

● తాగునీటి సమస్య పరిష్కారమైంది



తుంగభద్రకు వర్షం నీరు రావడంతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఊహించని సమయంలో తాగునీటికి ఇబ్బందులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునే సమయంలో ఎగువ ప్రాంతాల్లో వర్షం నీరు తుంగభద్ర నదికి నీరు నిండుగా ప్రవహిస్తుండటం శుభపరిణామం. నదీతీర గ్రామాల్లో దాదాపు తాగునీటి సమస్య పరిష్కారమైనట్లే. రెండు నెలలుగా నీరు లేక నిలిచిపోయిన తాగునీటి పథకాలు పునఃప్రారంభమయ్యాయి. దీంతో ఆయా గ్రామాల్లో దాహార్తి తీరుతుంది.

- పద్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, ఆదోని

వేదవతి పరవళ్లు

హొళగుంద , మే 19 (ఆంధ్రజ్యోతి): హొళగుంద మండల పరిధి మార్లమాడికి గ్రామం వద్ద ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లో వేదవతి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో నదికి వరద పోటెత్తింది. దీంతో గంట గంటకు నీటి మట్టం పెరుగుతోంది. అనంతపురం, రాయదుర్గంతో పాటు కర్ణాటకలోని శివమొగ్గ, సాగర్‌లోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వేదవతి నదికి వరద నీరు భారీగా చేరుతోంది. వరద ఉధృతి ఇలాగే కొనసాగితే ఆంధ్ర, కర్ణాటకకు రాకపోకలకు అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



మార్లమాడికి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వేదవతి నది

'పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'



వృద్ధులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న అధికారి

కర్నూలు కలెక్టరేట్, మే 19(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఉమ్మడి కర్నూలు జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారి రయీస్ ఫాతిమా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ట్రైసైకిల్‌ను వృద్ధులకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు కర్నూలు జిల్లాలో 73 మూడు చక్రాల వాహనాలు, 99 ల్యాప్‌టాప్స్, 27 ఇయర్ హియరింగ్ హెడ్స్, 50 టచ్ ఫోన్స్, 90 ట్రై సైకిళ్లు, 90 కుర్చీలు, 82 వీల్ చైర్లు, 98 సీనియర్ సిటిజన్ స్టిక్స్, 58 బ్లైండ్ స్టిక్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత పాల్గొన్నారు.

సీఐడీ నుంచి పది మంది మాతృశాఖకు

కర్నూలు క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు సీఐడీ రీజినల్ కార్యాలయం నుంచి పది మంది పోలీసులు మాతృశాఖకు బదిలీ చేస్తూ ఆశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, 8 మంది కానిస్టేబుళ్లు మాతృశాఖకు రానున్నారు. కర్నూలు ఎస్పీ కార్యాలయంలో రిపోర్టు చేసుకున్న అనంతరం వీరికి పోలీస్ స్టేషన్లు కేటాయిస్తారు.

మురుగు యార్డు

- కర్నూలు మార్కెట్ యార్డులో చెత్తాచెదారంతో దుర్వాసన
- రహదారులపై మురుగు



కూరగాయల వ్యర్థాలను తింటున్న పశువులు

కర్నూలు అగ్రికల్చర్, మే 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో ఎక్కడ చూసినా మురుగు, చెత్త కనిపిస్తోంది. పంట ఉత్పత్తుల క్రయ విక్రయాల్లో రాష్ట్రంలోనే గుర్తింపు పొందిన యార్డు ఇలా కావడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసిందంటే కాలు మోపేందుకు వీలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయల వ్యర్థాలతో దుర్వాసన

పాడైపోయిన కూరగాయలను ఇక్కడే పాడేస్తున్నారు. అలాగే చెత్తాచెదారం, వాము పొట్టుతో కనీసం కూర్చునే అవకాశంప లేదు. రహదారి బురదతో నిండి కుంటలను తలపిస్తున్నాయి. పశువులు, పందులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. చెత్తాచెదారం తొలగించి శుభ్రంగా ఉంచాలని అధికారులు ఎంత చెప్పినా కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఉన్నతాధికారులు వచ్చినప్పుడు మార్కెట్ కమిటీ అధికారులే సొంతంగా శుభ్రం చేయిస్తున్నారు. గత వైసీపీ హయాంలో రూ.6 కోట్లు ఖర్చు చేసి నిర్మించిన జంబో ప్లాట్‌ఫారం వర్షపు నీటితో నిండిపోయి పంట ఉత్పత్తులు తడిసిపోతున్నాయి. నిర్మించే సమయంలోనే బేస్‌మట్టాన్ని రోడ్డు కంటే ఎత్తుగా నిర్మించాలని రైతులు ఎంతగా మొరపెట్టుకున్నా ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోలేదు.



జంబో షెడ్‌లో వర్షపునీరు



ఆదమరిస్తే అంతే.. బురదతో నిండిన రహదారి



కుంట కాదు.. ఇది కూడా మార్కెట్ యార్డే



యార్డుకు వెళ్లాలంటే బురదలో నడవాల్సిందే

కారు బోల్తా.. ముగ్గురి దుర్మరణం

- మరో ముగ్గురికి గాయాలు
- మృతులు కర్ణాటక వాసులు
- శ్రీశైలానికి వెళ్లి వస్తుండగా ఘటన



రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన కారు



మృతులు నవీన్, లోకేశ్, సంతోశ్ (ఫైల్)

ప్యాపిలి, మే 19 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా కారు బోల్తాపడి ముగ్గురు దుర్మరణం పాలైన సంఘటన సోమవారం ప్యాపిలి మండలంలో చోటు చేసుకుంది. మృతులు ముగ్గురు కర్ణాటక రాష్ట్రానికి చెందినవారిగా పోలీసులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం తూముకూరు జిల్లా చిక్కనాయకనాహళ్లి తాలూకా కెంకెర గ్రామానికి చెందిన ఆరుగురు స్నేహితులు సంతోశ్(35), నవీన్(43), లోకేశ్(36), స్వామి, దర్శన్, శశిధర్ కలిసి శ్రీశైలం క్షేత్రానికి దర్శనానికి ప్లాన్ చేశారు. రెండు రోజుల కిందట కేఏ 02ఎంకే 44525 నంబర్‌గల ఇన్నోవా కారులో కర్నూలు జిల్లాలోని మంత్రాలయానికి వచ్చి దర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత ఆదివారం శ్రీశైల మల్లన్నను దర్శనం చేసుకుని తిరిగి సొంతూరికి బయల్దేరారు. అయితే అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంట ప్యాపిలి మండలం పోతుదొడ్డి గ్రామ సమీపంలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న కారుకు కుక్క అడ్డుగా వచ్చింది. దీంతో అదుపుతప్పి కారు డివైడర్‌ను ఢీకొట్టి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ మధుసూదన్ పోలీసులతో కలసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టి బాధితులను 108 అంబులెన్స్‌లో పోలీసులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన సంతోశ్, నవీన్, లోకేశ్ మృతి చెందగా.. మిగిలిన ముగ్గురు స్వల్పగాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై ప్యాపిలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా అతివేగంతో వస్తున్న కారు కుక్కను తప్పించే క్రమంలో ఉన్నఫళంగా బ్రేక్ వేయడంతో కారు బోల్తాపడినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

ఇదిలా ఉండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారిలో సంతోశ్ బీజేపీ నాయకుడిగా ఉంటూ కాంట్రాక్ట్ పనులు చేస్తుంటారు. ఈయనకు భార్య లక్ష్మితో పాటు ఒక కుమారుడు సంతానం. అదేవిధంగా లోకేశ్ చిరు వ్యాపారి. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు. నవీన్ కూడా తాళ్లూరు పంచాయతీ మాజీ అధ్యక్షుడు. ఈయనకు భార్య క్యావతో పాటు ఓ కుమారుడు సంతానం.

నకిలీ బిల్లుల వ్యాపారిపై కేసు నమోదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అవుకు, మే 19 (ఆంధ్రజ్యోతి): నకిలీ బిల్లులు సృష్టించి ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా అక్రమ రవాణా చేసి రూ.లక్షలు సొమ్ము చేసుకున్న మేడం సాయికుమార్ అనే వ్యాపారిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 17వ తేదీన ఆంధ్రజ్యోతిలో అడ్డదారిలో అక్రమ రవాణా కథనం ప్రచురితమైంది. దీంతో నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం అవుకు పట్టణానికి చెందిన వ్యాపారి సాయి కుమార్ బండారం బట్టబయలైంది. వివరాలివీ..

అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలనే దురాశతో వ్యాపారి సాయి కుమార్ కడప జిల్లాలోని కమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ పేరుతో నకిలీ బిల్లులు సృష్టించాడు. ఏకంగా 10 నకిలీ బిల్లులు బయటపడ్డాయి. ఏటా వందల లారీల ధాన్యాన్ని అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. గతంలో మాదిరిగానే ఈసారి జిల్లాలో రైతులు పండించిన వరి, జొన్న, శనగ, మొక్కజొన్న పలురకాల పంటల ధాన్యాలను కొనుగోలు చేసి తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, రాష్ట్రాలకు లారీల ద్వార అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మార్కెట్‌కు వడ్లకు 2 శాతం, మిగతా ధాన్యానికి 1 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. నకిలీ బిల్లులతో మార్కెట్ తనిఖీ కేంద్రాల వద్ద ఎలాంటి పన్ను చెల్లించకుండ లారీల ద్వార ధాన్యాన్ని అక్రమంగా తరలిస్తూ లక్షలు సొమ్ము ఆర్జిస్తూ వచ్చాడు. గత కొద్ది రోజుల క్రితం కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీలో తరలిస్తుండగా బేతంచర్ల మార్కెట్ తనిఖీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ జగదీష్ నకిలీ బిల్లుల బాగోతాన్ని గుర్తించి జేడీ దృష్టికి తీసుకెళ్లాడు. జిల్లా చెక్‌పోస్టుల్లోని రికార్డులను తనిఖీ చేయగా బేతంచర్ల చెక్‌పోస్టు నుంచి నకిలీ బిల్లులతో పలుమార్లు అక్రమ రవాణా జరిగినట్లు గుర్తించారు. డోన్‌కు చెందిన లారీ యజమాని ఇచ్చిన సమాచారంతో అక్రమ రవాణాకు పాల్పడిన వ్యక్తి సాయికుమార్‌గా గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో బనగానపల్లె మార్కెట్ కమిటీ సెక్రటరీ వెంకటేశ్వరరెడ్డి ఆధారా లతో సాయికుమార్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ రాజరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



స్వాధీనం చేసుకున్న నకిలీ బిల్లులు



వ్యాపారి సాయికుమార్

విద్యుత్ సరఫరాలో అంతరాయం

- జనరేటర్ల సాయంతో పునరుద్ధరణ
- ఇదీ స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ దుస్థితి



స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్



క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సబ్ స్టేషన్

కర్నూలు హాస్పిటల్, మే 19 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో సమస్యలు తలెత్తుతున్నాయి. గత నెల 19వ తేదీన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పూర్తి స్థాయిలో సేవలను వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. అత్యాధునిక భవనాలు, యంత్రాలు ఉన్న ఇక్కడ సిబ్బంది కొరత మాత్రం వేధిస్తుంది. సోమవారం క్యాన్సర్ హాస్పిటల్‌లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరా యం ఏర్పడింది. దీంతో ఉదయం ఏపీఎంఎస్ఐడీసీ ఎలక్ట్రికల్ ఇంజనీర్లు, కర్నూలు జీజీహెచ్ ఎలక్ట్రీషియన్లు మరమ్మతులు చేపట్టారు. రూ.120 కోట్లతో అత్యాధునికంగా నిర్మించిన స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌కు విద్యుత్ సమస్య తలెత్తితే మరమ్మతులు చేసే ఎలక్ట్రీషియన్లకు కూడా నియమించలేదు. ఇంత పెద్ద హాస్పిటల్‌కు డైరెక్టర్‌గా ఉన్న అధికారికి పూర్తి స్థాయిలో అధికారాలు బదలాయించలేదు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే డైరెక్టర్‌కు సొంతంగా డీజిల్ కొని జనరేటర్‌కు వేయించే అధికారం లేకపోవడం విశేషం. విద్యుత్ సరఫరా లేకపోవడంతో జనరేటర్ డీజిల్ కోసం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను 300 లీటర్ల డీజిల్ కోసం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ అధికారులు అడగాల్సి వచ్చింది. నెల క్రితం వైద్యఆరోగ్య శాఖ మంత్రి ప్రారం భించిన క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో అప్పుడే విద్యుత్ హెచ్‌టీ వైర్లు అప్పుడే తెగిపోవడంపై రోగులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా వైద్య విద్య ఉన్నతాధికారులు, కలెక్టర్ స్పందించి వర్షాకాలంలో క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు ఎలక్ట్రీషియన్ల నియమకాలు చేపట్టాలని రోగులు కోరుతున్నారు.

డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

డోన్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ సంస్థ - సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్) విజయవాడలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డైరెక్టర్ అండ్ హెడ్ డా.సీహెచ్ శేఖర్ తెలిపారు. పదో తరగతి విద్యార్హతతో మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ), బీఎస్సీ విద్యార్హతతో రెండు సంవత్సరాల వ్యవధి గల పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ- పీపీటీ) కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో ఈ నెల 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కోర్సులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంటు ఉంటుందని, సీపెట్ అడ్మిషన్ టెస్టు (క్యాట్)ను జూన్ 8న నిర్వహించి అందులో వచ్చిన ర్యాంకు ఆధారంగా విజయవాడ కేంద్రంలో గల 150 సీట్లను భర్తీ చేస్తామని చెప్పారు. వివరాలకు 8309398357 నెంబరును సంప్రదించాలన్నారు.

ఉపాధి కూలీ మృతి



శివన్న (ఫైల్)

కొత్తపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రమఠం గ్రామంలో ఉపాధి కూలీ నల్లవల్లి గొల్ల శివన్న(63) తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. మండల ఉపాధి అధికారి విమలమ్మ తెలిపిన వివరాలివీ.. సోమవారం శివన్న తోటి ఉపాధి కూలీలతో కలిసి గ్రామ శివారులోని ఫీడర్ చానెల్ పనులు చేస్తుండగా.. ఉన్న ఫలంగా తీవ్ర అస్వస్థతకు గురై కళ్లు తిరిగి పడిపోయారు. తోటి ఉపాధి కూలీలు హుటాహుటిన ఎర్రమఠం పీహెచ్‌సీకి తరలించగా.. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. అయితే.. తీవ్ర అస్వస్థతకు గురైన శివన్న మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు ఏపీవో తెలిపారు. శివన్నకు భార్య విజయమ్మతో పాటు కుమారుడు శ్రీకాంత్, కూతురు దానమ్మ ఉన్నారు.

ఈతకు వెళ్లి బాలుడు..



చరణ్ (ఫైల్)

ప్యాపిలి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.రంగాపురం గ్రామంలో సోమవారం ఈతకు వెళ్లి చరణ్(10) మృతి చెందాడు. గ్రామానికి చెందిన రామాంజినేయులు, సునీత దంపతులకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. చరణ్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో స్నేహితులతో కలసి గ్రామం సమీపంలోని కుంటకు ఈతకు వెళ్లాడు. ఈత పూర్తి చేసుకొని ఇంటికి బయలుదేరుతున్న సమయంలో చరణ్ కనపడక పోవడంతో తోటి మిత్రులకు అనుమానం వచ్చింది. కుంట సమీపంలోని పొలం ఉన్న రైతులకు పిల్లలు విషయాన్ని తెలిపారు. దీంతో కుంటలో దిగి చూడగా చరణ్ మృతదేహం కనపడటంతో బయటకు తీశారు. కొడుకు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు బోరున విలపించారు.

రుణభారంతో రైతు ఆత్మహత్య



ప్రకాష్ (ఫైల్)

దేవనకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రైతు ప్రకాష్(48) సోమవారి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. మృతుడు తన ఎకరా పొలంతో పాటు మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగుచేశాడు. అయితే నష్టం వచ్చి, దాదాపు రూ.15 లక్షలు అప్పులయ్యాయి. వీటిని ఎలా తీర్చాలో తెలియక ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య మంగమ్మ, ఇద్దరు కుతూర్లు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

బేతంచెర్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగానిపల్లె తండాకు చెందిన హరీష్ నాయక్ అనే యువకుడు ఏడేళ్ల బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడటంతో పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు సోమవారం తెలిపారు. ఈనెల 18న బాలిక ఆడుకుంటుండగా.. మాయమాటలు చెప్పి మిద్దెపైకి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేశాడని, బాలిక కేకలు వేయడంతో పరారయ్యాడని తెలిపారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పు తగాదా వల్లే హత్య

- హత్యకేసు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి

హాలహర్వి, మే19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమృతాపురం గ్రామానికి చెందిన పెద్ద వెంకటేశులు హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణమని ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్ఐ చంద్ర తెలిపారు. సోమవారం హాలహర్వి పోలీస్‌స్టేషన్‌లో హత్యకేసు నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలను వెల్లడించారు. వివరాల మేరకు.. పెద్ద వెంకటేశులు సమీప బంధువు సోమన్నకు గతంలో రూ.3లక్షలు అప్పు ఇచ్చాడు. అయితే సోమన్న రూ.2లక్షలు మాత్రమే చెల్లించాడు. దీంతో వెంకటేశులు సోమన్నకు చెందిన 3 ఎకరాలను కౌలుకు రాయించుకున్నాడు. వడ్డీ మీద వడ్డీ వసూలు చేస్తూ సోమన్నకు వేధించడంతో తట్టుకోలేక ఊరు వదలి అనంతపురం జిల్లా సెట్టూరు గ్రామానికి వెళ్లి అక్కడ కౌలుకు వ్యవసాయం చేస్తున్నాడు. కాగా వెంకటేశులు వేధింపులు అధికం చేసి, సోమన్న చెల్లించిన రూ.2లక్షలను చేర్చకుండా రూ.3 లక్షలకు కోర్టులో కేసు వేశాడు. వేధింపులు భరించలేక సోమన్న అదే గ్రామానికి చెందిన నటరాజ్‌గౌడ్ సాయంతో కిరాయి హంతకులు హొళగుందకు చెందిన నాగరాజు, కర్ణాటక రాష్ట్రం ఉత్తనూరుకు చెందిన భోగప్ప, ధనుంజయలు, ఈరన్నతో పెద్ద వెంకటేశులును హతమార్చేందుకు రూ.2 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఒప్పందం మేరకు పొలంలో పశువులు మేపుతున్న పెద్ద వెంకటేశులును హతమార్చారు. విచారణ అనంతరం విరుపాపురం గ్రామం బల్లోట బసవేశ్వరస్వామి ఆలయం వద్ద నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

పిడుగుపాటుకు మేకలు, గొర్రెల మృతి



మేకలు, గొర్రెలతో బాధితులు

ఆదోని రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండవగల్లు ఆదివారం రాత్రి గ్రామంలో భారీ వర్షంతో పాటు పిడుగు పడి 14మేకలు, గొర్రెలు మృతి చెందాయి. బాధితులు తిక్కయ్య, దాస్, నరసయ్య, గోకర్ణ కథనం మేరకు.. తమ మేకలు, గొర్రెలను మేపడానికి పొలానికి వెళ్లి రాత్రి జీవాలతోపాటు పొల్లాలోనే ఉండిపోయారు. రాత్రి 10గంటల సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమైంది. దీంతో యజమానులు ఇంటికి వచ్చేశారు.ఉదయం వెళ్ళి చూడగా 18మేకలు, గొర్రెలు మృతి చెంది కనపించాయి. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు వైసీపీకి లేదు

- మినీ మహానాడులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

నంద్యాల రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు వైసీపీకి లేదని టీడీపీ జిల్లు అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మినీ మహానాడు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని అన్నారు. ఇప్పటికైనా వారి మాటతీరు మార్చుకుని అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈనెలఖారులో కడపలో జరిగే మహానాడుకు ప్రతి కార్యకర్త సభ్యత్వ కార్డులు వేసుకొని రావాలని కోరారు. అలాగే ఇంకా మంజూరు చేయాల్సిన కార్డులను త్వరగా పంపిణీ చేయాలన్నారు. అనంతరం నంద్యాలలో రోడ్డు వెడల్పు, సమ్మర్ స్టోరేజ్, బీసీ భవన్, మౌలిక వసతులు, వంటి వాటికి తీర్మానం చేశారు. అనంతరం మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, ఎన్ఎండీ ఫిరోజ్ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం ఇంకా అభివృద్ధి చెందుతుందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో నంద్యాల వైసీపీ ఎమ్మెల్యే సండే ఎమ్మెల్యేగా పేరుపొందారని అన్నారు. వారంలో రెండు రోజులు మాత్రమే ఉండి పోయే వారు అభివృద్ధి ఏం చేస్తారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి, నంద్యాల టీడీపీ అబ్జర్వర్ పోతురాజు, రవికుమార్, నరహరి విశ్వనాథరెడ్డి, ఏవీఆర్ ప్రసాద్, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తూరులో ఘనంగా కుంభాభిషేకం

● కలశ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు దంపతులు



కలశాలను యాగశాలకు తీసుకువస్తున్న గౌరు దంపతులు

పాణ్యం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా కుంభాభిషేక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, టీడీపీ నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ఎమ్మెల్యే దంపతులు పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులను ఆలయ అర్చకులు నారాయణస్వామి, సురేష్‌శర్మ, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రంగరమేష్, భాస్కరరెడ్డి, ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి, ఏఎస్‌ఐ, నాయకులు పాల్గొన్నారు.

పల్లకిలో మహానందీశ్వరుడు



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

మహానంది, మే 19 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీ సేవ ఆలయ వేదపండితులు ఘనంగా నిర్వహించారు. స్వామివారి, అమ్మవారి ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ మెదటి ప్రాకారంలో భక్తుల శివనామస్మరణ మధ్య స్వామి, అమ్మవార్ల పల్లకిసేవను నిర్వహించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పదవులకే వన్నె తెచ్చిన నేత నీలం సంజీవరెడ్డి



నీలం సంజీవరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సమాఖ్య సభ్యులు

నంద్యాల కల్చరల్, మే 19(ఆంధ్రజ్యోతి): పదవులకే వన్నె తెచ్చిన నేత నీలం సంజీవరెడ్డి అని రైతు సమాఖ్య నాయకులు అన్నారు. భారత మాజీ రాష్ట్రపతి దివంగత నీలం సంజీవరెడ్డి 112 జయంతిని నంది రైతు సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సమాఖ్య గౌరవసలహాదారులు విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్‌బాద్ రవీంద్రనాథ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి వివిధ సాహితీ సంఘాల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. సంజీవరెడ్డి చిత్రపటానికి పూలమాలల వేసి నివాళి అర్పించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ గెలివి సహదేవుడు హాజరై మాట్లాడుతూ నంద్యాల నుంచి జనతాపార్టీ అభ్యర్థిగా గెలుపొందిన సంజీవరెడ్డి తదనంతరం జరిగిన రాజకీయ పరిణామాలతో ఏకగ్రీవంగా రాష్ట్రపతిగా ఎన్నికై దేశానికి సేవలు అందించడం గర్వకారణమన్నారు. అనంతరం నీలం సంజీవరెడ్డి జీవిత విశేషాలపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో రైతు సమాఖ్య ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కోఆర్డినేటర్ ఓబులపతి, తెలుగుపండిట్ అన్నెం శ్రీనివాసరెడ్డి, ఆర్‌జేయూపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శేషఫణి, రోటరీ డీవీ సుబ్బయ్య, రఫి పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశాలలో మందుల కొరత

పాములపాడు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన పాములపాడులోని ఆయుర్వేద వైద్యశాలలో మందుల కొరత ఉందని వైద్యాధికారి సావిత్రి అన్నారు. సోమవారం స్థానిక విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది ఏప్రిల్‌లో మందులు సరఫరా అయ్యేవని ఈ ఏడాది మే ముగుస్తున్నా మందులు రాలేదన్నారు. దాంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తే రోగులకు అందజేస్తామన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నంద్యాల రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుగుణశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ప్రభాకర్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

దోమల నివారణ మందు పిచికారీ

మహానంది, మే 19 (ఆంధ్రజ్యోతి): మహానంది సమీపంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల పరిసరాల్లో మలేరియా నివారణ సిబ్బంది దోమల మందు పిచికారీ చేశారు. సోమవారం గ్రామ పంచాయతీ అధికారి కలువ భాస్కర్ ఆధ్వర్యంలో మలేరియా ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి సిబ్బంది చేత స్ప్రే చేయించారు. ఎంపీహెచ్‌ఈవో ఉసేన్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ అజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

గిరిజన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

నంద్యాల నూనెపల్లె, మే 19(ఆంధ్రజ్యోతి): సోలార్‌లో భూములు కోల్పోయిన గిరిజన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ డిమాండ్ చేశారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ కంపెనీల ఏర్పాటులో భూములు కోల్పోయిన గిరిజనులకు ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

చేపలను అక్రమంగా తరలిస్తున్నారు..

పాణ్యం, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపనపాడు గ్రామ చెరువు నుంచి అక్రమంగా చేపలు తరలిస్తున్నారని గ్రామస్థులు అన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. గ్రామస్థులు మాట్లాడుతూ ఎటువంటి గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా చేపలు తరలించి గ్రామపంచాయతీ ఆదాయానికి గండికొడుతున్నారని ఆరోపించారు. అనుమతి లేకుండా చేపలు పట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై డీపీవో రాంబాబు మాట్లాడుతూ గతంలో చేపలు పట్టుకోవడానికి వేలాలకు తేదీలు ఖరారు చేసి నోటీసులు ఇచ్చామన్నారు. ఎమ్మెల్యే అనుమతి మేరకు వేలాలు వాయిదా వేశామన్నారు.

పనిచేసే కార్యకర్తలకు ప్రాధాన్యం

● చంద్రబాబు నాయకత్వంతోనే రాష్ట్రానికి భవిష్యత్
● శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, మే 19(ఆంధ్రజ్యోతి): టీడీపీలో పనిచేసే కార్యకర్తలకు తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆత్మకూరులోని ఎంఅండ్ఎం ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా దివంగత ఎన్టీఆర్, బుడ్డా వెంగళరెడ్డిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి ప్రతి రెండేళ్లకు ఓసారి మహానాడు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో ప్రధానంగా పార్టీ భవిష్యత్ కార్యాచరణ, పునర్ నిర్మాణ అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. అయితే 43ఏళ్లుగా తెలుగుదేశం పార్టీ కోసం కార్యకర్తలు, నాయకులు చేస్తున్న కృషిని పార్టీ ఎప్పటికీ మరచిపోలేదని అన్నారు. ఇదేస్ఫూర్తితో రాబోయే రోజుల్లో కూడా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు మరింత ఉత్సాహంతో పని చేయాలని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనతో రాష్ట్రం అన్ని విధాలుగా సర్వనాశనమైందని మండిపడ్డారు. ఈ పరిస్థితుల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11నెలల్లోనే సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం శ్రమిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానీ నరేంద్రమోదీ సహకారంతో రాజధాని అమరావతిని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అలాగే రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకోవడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. కాగా శ్రీశైల నియోజకవర్గాన్ని కూడా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే మహానాడు కార్యక్రమానికి టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేసీకెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, మహానంది ఎంపీపీ యశశ్వినీ, నాయకులు యుగంధర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాషా, శేషిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసరెడ్డి, భరద్వాజశర్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు కృషి

నంద్యాల రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ అన్నారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల ఆశయ సాధనకు పాటు పడిన సుందరయ్య మనందరికీ ఆదర్శప్రాయుడన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగరాజు, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, నరసింహ, తోటమద్దులు, మౌలాలి పాల్గొన్నారు.

పగిడ్యాల: పుచ్చలపల్లి సుందరయ్య పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ఉద్యమాలు కొనసాగించాలని సీపీఎం మండల కన్వీనరు పక్కీర్ సాహెబ్ అన్నారు. పగిడ్యాల బస్టాండ్ ఆవరణంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఈశ్వరమ్మ, త్యాగరాజు, మద్దమ్మ, మరియమ్మ తదితరులు ఉన్నారు.

ఆత్మకూరు: పుచ్చలపల్లి సుందరయ్యను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు ఏసురత్నం, సీపీఎం సీనియర్ నాయకులు నరసింహానాయక్, రణధీర్, రజాక్ అన్నారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సమావేశంలో నాయకులు సురేంద్ర, వీర న్న, నాగేశ్వరరావు, కిరణ్, గణపతి, మహ్మద్, చిన్న అంబయ్య, రవి, పుల్లయ్య, నాగేశ్వరరావు, మౌలాలి, వెంకట సుబ్బయ్య, నూర్ అహ్మద్ పాల్గొన్నారు.



నంద్యాలలో మాట్లాడుతున్న రమేష్‌కుమార్

నందికొట్కూరు: పట్టణంలోని సీపీఎం కార్యాలయం పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు కర్న, ఉస్మాన్, దూదేకుల భాష, వెంకటేశ్వర్లు, బాలస్వామి, అమిరునిస్సా, స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: సుందరయ్య 40వ వర్ధంతిని సీపీఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా సుంద రయ్య చిత్రపటానికి నాయకులు డేవిడ్, రత్నమయ్యలు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. పేద, పీడిత వర్గాల కోసం సుందరయ్య చేసిన పోరాటాలు స్ఫూర్తిగా పని చేయాలని వారు కోరారు.





నందికొట్కూరు, ఆత్మకూరులో సుందరయ్య చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

'పది' సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

● మొదటిరోజు 502 మంది విద్యార్థుల గైర్హాజరు



పరీక్షలను పర్యవేక్షిస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, మే 19(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో 35 పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. డీఈవో జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ 35 పరీక్షా కేంద్రాల్లో మొదటి రోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు 1231 మంది విద్యార్థులకు గాను 729 మంది విద్యార్థులు హాజరయ్యారని, 502 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 15 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగలేదన్నారు. అదేవిధంగా సార్వత్రిక పీఠం 10వ తరగతి పరీక్షల్లో భాగంగా మొదటిరోజు నాలుగు కేంద్రాల్లో 16 మంది విద్యార్థులకు హిందీ పరీక్ష నిర్వహించగా, 12 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలో భాగంగా మొదటి రోజు రెండు కేంద్రాల్లో హిందీ పరీక్ష నిర్వహించగా 68 మంది విద్యార్థులకు గాను, 56 మంది విద్యార్థులు హాజరై 12 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వివరించారు.

ఎస్ఎస్ఏలో పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

నంద్యాల ఎడ్యుకేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సర్వశిక్షా అభియాన్‌లో ఖాళీగా ఉన్న మూడు పోస్టులకు అర్హులైన ప్రభుత్వ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్ ప్రేమంత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, ఆల్టర్నేట్ స్కూలింగ్ కో ఆర్డినేటర్, అసిస్టెంట్ కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ పోస్టులకు ఫారిన్ సర్వీస్ నిబంధనల మేరకు అర్హులైన ప్రభుత్వ లేదా జిల్లాపరిషత్ లేదా మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న, ఐదేళ్ల సర్వీసు కల్గిన స్కూల్ అసిస్టెంట్లు, ఎనిమిదేళ్ల అనుభవమున్న ఎస్జీటీలు అర్హులని తెలిపారు. ఏప్రిల్ 30 నాటికి 55యేళ్లలోపు వయస్సు కల్గిన వారు దరఖాస్తులను ఈనెల 22వ తేదీ వరకు ఎస్ఎస్ఏ కార్యాలయంలో అందజేయాలని కోరారు. నంద్యాల జిల్లాలో పనిచేస్తున్న వారు మాత్రమే అర్హులన్నారు.

రూ.1.50కోట్లతో కోర్టు భవనాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు

నంద్యాల హాస్పిటల్, మే 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని కోర్టు భవనాల్లో మరుగుదొడ్ల మరమ్మతులు, నిర్మాణాలకు గాను రూ.1.50కోట్ల నిధులు మంజూరైనట్లు ఆర్‌అండ్‌బీ శాఖ ఈఈ శ్రీధర్‌రెడ్డి సోమవారం తెలిపారు. సీఎస్ఎస్ కింద జిల్లాలో ఆరు కోర్టు భవనాలకు ఈ నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఆళ్లగడ్డ, బనగానపల్లె, కోవెలకుంట్ల, నందికొట్కూరు, ఆత్మకూరు కోర్టులలో మరుగుదొడ్ల నిర్మాణం, నంద్యాల కోర్టు భవనంలో మరుగుదొడ్ల మరమ్మతులకు గాను రూ.6లక్షలు, ప్రహరీకి రూ.18లక్షలు మంజూరయ్యాయన్నారు. ఒక్కొక్క కోర్టు భవనానికి దాదాపు రూ.25లక్షలు మరుగుదొడ్ల కోసం మంజూరయ్యాయన్నారు. ఈ నిర్మాణాలకు సంబంధించిన టెండర్లు పిలిచామని ఈ నెల 21న టెండర్లు తెరవనున్నామని పేర్కొన్నారు. ఈ నిర్మాణాలు ఒక నెలలోనే పూర్తిచేయాలని ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. మరుగుదొడ్లలో దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్స్, కక్షిదారులకు అవసరమైన వసతులు ఏర్పాటు చేస్తామన్నారు.

బంగారు గొలుసు అప్పగింత



భక్తుడికి బంగారు గొలుసును అప్పగిస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్

మహానంది, మే 19 (ఆంధ్రజ్యోతి): మహానందీశ్వరుడి దర్శనం కోసం వచ్చి కోనేరులో పుణ్య స్నానాలు చేసే సమయంలో పోగొట్టుకొన్న బంగారు గొలుసును భక్తులకు దేవస్థానం అధికారులు అప్పగించారు. సోమవారం ప్రకాశం జిల్లా పాముర్రు మండలం వంగంపల్లెకు చెందిన వెంకటరెడ్డి కుటుంబ సభ్యులతో కలసి మహానంది క్షేత్రానికి వచ్చారు. కోనేరులో పుణ్యా స్నానాలు చేస్తున్న సమయంలో తులం బంగారు గొలుసు జారీ నీటిలో పడిపోయింది. విషయాన్ని అక్కడ విధులు నిర్వహించే హోమ్‌గార్డు శరత్‌నాయక్‌కు తెలపడంతో స్థానిక చెంచు యువకులతో వెతికించారు. దొరికిన బంగారు గొలుసును టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య బాధిత భక్తుడికి అప్పగించారు.

ఉప్పొంగిన తిరంగా స్ఫూర్తి



తిరంగా ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు, మే 19(ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్'లో భారత్ విజయాన్ని హర్షిస్తూ ఆత్మకూరులో సోమవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి నేతృత్వంలో చేపట్టిన తిరంగా ర్యాలీలో దేశభక్తి ఉప్పొంగింది. స్థానిక నంద్యాల టర్నింగ్ నుంచి మొదలైన ఈ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలతో పాటు రిటైర్డు ఆర్మీ జవాన్లు, ఎన్‌సీసీ కెడెట్లు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భారీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి కేజీ రోడ్డు మీదుగా ర్యాలీగా తరలివెళ్లారు. అనంతరం గౌడ్ సెంటర్‌కు చేరుకుని అక్కడ అమర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఎమ్మెల్యే బుడ్డా మాట్లా డుతూ.. అన్ని రంగాల్లో భారత్ ఎదుగుదలను చూసి ఓర్వలేకే పాకిస్థాన్ ఉగ్రవాదులను మనదేశంపై ఉసిగొల్పుతోందని అన్నారు. శ్రీశైల నియోజకవర్గం బీజేపీ, జనసేన ఇన్‌చార్జిలు మోమిన్ షబాన, రౌతు అశోక్, మహానంది ఎంపీపీ యశశ్వినీ, తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు ఉన్నారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్, అర్బన్, రూరల్ సీఐలు రాము, సురేష్‌కుమార్ రెడ్డి, ఎస్సై నారాయణరెడ్డిల ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు.

రూ.1.20 కోట్లతో తాగునీటి సౌకర్యం

కొత్తపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనిమిది గిరిజన గూడేల గిరిజనులకు శుద్ధజలాలు అందించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జల్‌జీవన్ మిషన్ పథకం కింద రూ.1.20 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జుబేర్ తెలిపారు. సోమవారం ఆయన కొత్తపల్లిలో మాట్లాడుతూ కొత్తపల్లి భ్రమరాంబ చెంచుగూడెంకు 90వేల లీటర్ల ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుతో పాటు విద్యుత్ మోటారు, పైపులైన్, ట్యాప్ కనెక్షన్ కోసం రూ.72 లక్షల నిధులు కేటాయించినట్లు చెప్పారు. అలాగే ఎర్రమఠం గూడెంకు రూ.10లక్షలు, జానాల గూడెంకు రూ.4 లక్షలు, బలపాలతిప్పకు రూ.4 లక్షలు, సిద్దేశ్వరం గూడెంకు రూ.3లక్షలు, ముసలిమడుగు గూడెంకు రూ.10లక్షలు, పాతమాడుగుల గూడెంకు రూ.2.50 లక్షలు పెద్దగుమ్మడాపురం గూడెంకు రూ.6 లక్షల నిధులు జల్‌జీవన్ మిషన్ కింద మంజూరైనట్లు చెప్పారు.

కంపెనీలు కొనుగోలు చేయాలి

● కలెక్టరేట్ ఎదుట పొగాకు రైతుల ఆందోళన

నంద్యాల నూనెపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పొగాకు మొత్తాన్ని ఒప్పందం చేసుకున్న ప్రకారం కంపెనీలు కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పొగాకు రైతులు పొగాకు బేళ్లతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రైతులు సాగు చేసిన పొగాకు కొనుగోలు చేయడానికి కంపెనీలు ముందుకు రాకపోవడంతో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు కంపెనీల ప్రతినిధులను చర్చలకు పిలిపించి న్యాయం చేయాలని కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ జోక్యం చేసుకొని కంపెనీ ప్రతినిధులను చర్చలకు పిలిపిస్తామని హామీ ఇచ్చారు. రైతులు పండించిన మొత్తం పొగాకును వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని క్వింటాలుకు రూ.18,500కు కొనుగోలు చేయాలని నంద్యాలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, సభ్యుడు ప్రసాద్, పొగాకు రైతులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, పొగాకు రైతులు

వేలంలో తగ్గిన ఆదాయం

పాములపాడు, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో ఆలయ భూములకు సంబంధించి నిర్వహించిన కౌలు వేలంలో గతేడాది కంటే ఈ యేడాది ఆదాయం తగ్గిందని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ బాలచెంచన్న తెలిపారు. సోమవారం స్థానిక చౌడేశ్వరీదేవీ అలయ ఆవరణలో ఏడీ వెంకటరమణ ఆధ్వర్యంలో చెన్నకేశవ ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన 31ఎకరాలు, చౌడేశ్వరీ ఆలయానికి చెందిన 19 ఎకరాలు, నాగలింగేశ్వరస్వామికి చెందిన 13 ఎకరాల భూములకు కౌలుకు వేలం నిర్వహించారు. అయితే గతేడాది రూ. 6.87లక్షల ఆదాయం రాగా ఈయేడాది కేవలం రూ. 2.76 లక్షలు వచ్చాయని, రూ.4.11 లక్షలు ఆదాయం తగ్గిందని తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బీరవోలులో టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

పగిడ్యాల, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బీరవోలు గ్రామంలో కార్యకర్తలకు వచ్చిన సభ్యత్వ కార్డులను టీడీపీ నాయకుడు చిమ్మె బిచ్చన్న సోమవారం పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి అండగా ఉన్న కార్యకర్తను ఆదుకు నేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక ప్రయోజనాలను చేకూర్చారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జయరాఘవ నాయుడు, శ్రీనివాసులు, రమాణారెడ్డి ఉన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

నందికొట్కూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విత్తన దుకాణాల్లో అగ్రికల్చర్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని పలు విత్తన దుకాణాల్లో నందికొట్కూరు ఏవో షేక్షావలి సీడ్స్ శాంపుల్స్‌ను సేకరించారు. పత్తి విత్తనాలు 30 శాంపుల్స్ తీసి పరీక్షలకు పంపినట్లు ఆయన తెలిపారు. ఆ పరీక్షల్లో వచ్చే నివేదికల ఆధారంగా తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

వెలుగోడు ఎస్ఐగా సురేశ్

వెలుగోడు, మే 19 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు ఎస్ఐగా సురేశ్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. వెలుగోడులో ఎస్ఐగా పని చేస్తున్న విష్ణు నారాయణ చిత్తూరు జిల్లాకు బదిలీ కావడంతో నంద్యాల టూటౌన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సురేశ్‌ను వెలుగోడుకు బదిలీ అయ్యారు.

గోస్పాడు ఎస్ఐగా సుధాకర్ రెడ్డి

గోస్పాడు, మే 19 (ఆంధ్రజ్యోతి): గోస్పాడు మండల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా సుధాకర్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ వెంకటప్రసాద్ ఇంటెలిజెన్స్‌కు బదిలీ అయ్యారు. నంద్యాల టూ టౌన్‌లో పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డి గోస్పాడుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు ఉంటే పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. పలువురు మండల ప్రజ లు, నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉత్కంఠకు తెర

● ఊహించని రీతిలో టీడీపీ మండలాధ్యక్షుల నియామకం
● కొత్త వారికి ప్రాధాన్యం కల్పించిన ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు/మహానంది/బండిఆత్మకూరు/వెలుగోడు, మే 19 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల నియోజకవర్గంలోని ఆయా మండలాల టీడీపీ అధ్యక్షులుగా నియామకానికి సంబంధించి కొన్ని రోజుల్లో పార్టీ శ్రేణుల్లో నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. సోమవారం ఆత్మకూరులో జరిగిన మినీ మహానాడులో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఎవరూ ఊహించని రీతిలో ఆయా మండలాల అధ్యక్షుల పేర్లను ప్రకటించారు. అయితే ఈ నియామకాల్లో అన్ని మండలాల అధ్యక్షులను మార్చేసి వారి స్థానంలో కొత్త వారికి అధిక ప్రాధాన్యం కల్పించారు. అదేక్రమంలో గతంలో అధ్యక్షులుగా సేవలందించిన వారికి కూడా జిల్లా కమిటీల్లో స్థానం కల్పించనున్నట్లు సమాచారం.

నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరే...

మండలం	అధ్యక్షులు	ప్రధాన కార్యదర్శి
శ్రీశైలం	శ్రీనివాసరెడ్డి	సురేష్
ఆత్మకూరు	రవీంద్రబాబు	నబిసా
వెలుగోడు	అబ్దుల్‌కలాం	రమణ
బండిఆత్మకూరు	కృష్ణారెడ్డి	చెలమయ్య
మహానంది	శివశంకరప్రసాద్	రాజునాయక్
ఆత్మకూరుటౌన్	జెట్టి వేణుగోపాల్	అబ్దుల్లాపురం బాషా
వెలుగోడు టౌన్	రసూల్	భద్రుడు

మండ్లెంలో పోలీసుల కార్డన్ సెర్చ్

జూపాడుబంగ్లా, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండ్లెం గ్రామంలో సోమవారం తెల్లవారుజామున ఎస్ఐ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఉన్న రౌడిషీటర్లు, అనుమానిత ప్రాంతాలు, అనుమానాస్పద వ్యక్తుల ఇంట్లో సోదాలు చేశారు. అన్ని గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలను అదుపు చేయడమే లక్ష్యంగా సోదాలు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. గొడవలు, అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలను పాల్పడే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఓ వ్యక్తి వద్ద 30మద్యం సీసాలను పట్టుకుని సీజ్ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సంజీవ, పోలీసులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

కమనీయం.. వేంకటేశ్వరస్వామి కల్యాణం



ఉత్సవమూర్తుల కల్యాణంలో పాల్గొన్న దంపతులు

చాగలమర్రి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు రాళ్ల పల్లె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు సోమవారం ఆలయంలో వేద పండితుడు పెద్దశాస్త్రీ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. చింతలచెరువుకు చెందిన ఉభయదారులు సుబ్బరాయుడు, వెంకటతులశమ్మ దంపతులు, వారి కుటుంబ సభ్యులచే కల్యాణం నిర్వహించారు. తాళిబొట్టు కట్టించి తలంబ్రాలు పోయించారు. అనంతరం వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తుల పల్లకీ ఉత్సవం చేశారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులు పెళ్లి చదివింపులు చదివించారు. దాతల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

వాసాపురంలో..



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

రుద్రవరం: మండలంలోని వాసాపురంలో లక్ష్మీ గోదాదేవి, వేంకటేశ్వరస్వామి కల్యాణం సోమవారం కమనీయంగా సాగింది. అర్చకులు వారణాసి గోపిశర్మ, తిరుమల తిరుపతి అర్చకులు శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య కల్యాణం నిర్వహించారు. స్వామి, అమ్మవారి కల్యాణం తిలకించడానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఉత్సవమూర్తులను పల్లకీ సేవ నిర్వహించారు.

ఉపాధి హామీ ఎఫ్‌ఏల నియామకం

చాగలమర్రి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగా ఆరుగురు ఉపాధిహామీ ఎఫ్‌ఏలను నియమించినట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఏపీవో ఖాసీంసాహేబ్ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆరుగురు ఎఫ్‌ఏలకు నియామక పత్రాలను అందజేశారు. గొడిగనూరు ఎఫ్‌ఏగా బాబు, డి.వనిపెంట నరసింహులు, మల్లేవేముల నందిని, చిన్నవంగలి నర్సిరెడ్డి, చిన్నబోధనం ఇతేశ్వర్‌రెడ్డి, చింతలచెరువు గోవిందరెడ్డిలను నియమించామన్నారు. బాధ్యతలు చేపట్టిన ఎఫ్‌ఏలు విధులు సక్రమంగా నిర్వహించి ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని, విధుల్లో అలసత్వం వహించరాదన్నారు. కార్యక్రమంలో సీవో మహబూబ్‌పీర, కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్ ఉన్నారు.

జాతీయ రహదారిపై వాహనాలు బోల్తా

శిరివెళ్ల, మే 19(ఆంధ్రజ్యోతి) : కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై రెండు వేర్వేరు ప్రమాదాల్లో రెండు వాహనాలు బోల్తా పడ్డాయి. చెన్నై నుంచి నాగపూర్‌కు వెళ్తున్న ఓ లారీ యర్రగుంట్ల గ్రామం వద్ద అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. అలాగే నంద్యాల నుంచి ఆళ్లగడ్డ వైపు జొన్నల లోడుతో వెళ్తున్న ఓ ట్రక్కు శిరివెళ్ల మెట్ట సమీపంలో రహదారిపై బోల్తా పడింది. ఈ రెండు ఘటనల్లో డ్రైవర్లు స్వల్పంగా గాయపడ్డారు. శిరివెళ్ల పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఆర్డీవో

డోన్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు ఉన్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో నరసింహులు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు మట్టిమిద్దెలు, శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే నిర్మాణాల్లో ఉన్న వారు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలకు బయటకు వెళ్లకూడదన్నారు. వర్షాల కారణంగా ఏదైనా ప్రమదాలు సంభవిస్తే రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం 897890084ను సంప్రదించాలన్నారు.

క్రీడానైపుణ్యాన్ని పెంచుకోవాలి



క్రికెట్ బ్యాట్‌లను పంపిణీ చేస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో పిల్లలు క్రీడల్లో పాల్గొని క్రీడానైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో క్రీడాకారులకు క్రికెట్ బ్యాట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిభ గల క్రీడాకారులకు అన్ని రకాల ప్రోత్సాహం అందిస్తామన్నారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

సంజామల, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నొస్సం గ్రామంలో వైసీపీకి చెందిన పలువురు టీడీపీలో చేరారు. సోమవారం కోవెలకుంట్ల పట్టణంలో నిర్వహించిన మినీ మహానాడులో టీడీపీ నాయకులు గాధంశెట్టి రమణయ్య, వెంకటేశ్వర్లు, చీరెడ్డి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో నొస్సం మాజీ సర్పంచ్ గాలిపోతుల పుల్లన్న, మాజీ జడ్పీటీసీ గాలిపోతుల ఓబులేసు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారిని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెండేకంటి కిరణ్ కుమార్, బెలుం సురేష్ రెడ్డి, శంకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, నాగిరెడ్డి, జిల్లా వెంకటేశ్వర్లు, తిమ్మయ్య, మూసాని చంద్రశేఖర్ రెడ్డి, మోహన్ రెడ్డి, కేశవ రెడ్డి, శేషారెడ్డి, బత్తుల ప్రతాప్ రెడ్డి, మల్కి హుసేన్, తోకల మద్దిలేటి ఉన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

కొలిమిగుండ్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ఎన్‌హెచ్ 544డి రోడ్డుపై వర్షపు నీరు నిలువకుండా డ్రైనేజీ పనులను అధికారులు సోమవారం ప్రారంభించారు. రెండు రోజుల క్రితం మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి వర్షపు నీరు నిలుస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. దీంతో హైవే అధికారులు రహదారి ఎత్తు పెంచటంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి పనులను ప్రారంభించారు. వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కష్టపడి పనిచేసే కార్యకర్తకు గుర్తింపు

- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ
- నియోజకవర్గ మహానాడుకు తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ మే 19(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం ఆళ్లగడ్డ పట్టణంలోని శ్రీ రామ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గం మహానాడు నిర్వహించారు. వివిధ మండలాల నుంచి కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కార్యకర్తలు, నాయకులు ఎన్నో కష్టాలు పడ్డారన్నారు. భూమా నాగిరెడ్డిగారిని, శోభానాగిరెడ్డి గారి కార్యకర్తలను కుటుంబ సభ్యులను ఒకే విధంగా చేసేవారని కార్యకర్తలంటే వారి అంత ప్రేమ ఉండేదన్నారు. ప్రతి కార్యకర్తను తన కుటుంబ సభ్యులుగా చూస్తు వస్తున్నామని, త్వరలో సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ సెల్ ని ర్వహిస్తామన్నారు. అనంతరం టీడీపీ పరిశీలకుడు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పింది చేసే వారని ఎన్నికల్లో ఇచ్చిన మాటను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటు ముందుకు పోతున్నారన్నారు. కడపలో జరిగే మహానాడు కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకరవ్గ నాయకులు భార్గవరామ్, శ్రీకాంత్‌రెడ్డి, యామా గుర్రప్ప, కిరన్మయి, డాక్టర్ రాంగో పాల్‌రెడ్డి, సీఆర్ రెడ్డి, చింతకుంట లక్ష్మీదేవమ్మ, సీపీ వాసు, మధు, వసంత, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు

ఆళ్లగడ్డలో తిరంగా ర్యాలీ

ఆళ్లగడ్డలో అమరవీరుడు మురళీ నాయక్‌కు నివాళులు అర్పిస్తూ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియా ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక శ్రీరామ ఫంక్షన్ హాల్ నుంచి కొవ్వొత్తులు చేతపట్టుకొని భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేస్తూ మున్సిపల్ కార్యాలయం మీదుగా నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి పక్కన ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాయకులు భార్గవ్‌రామ్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సీఐలు మురళీధర్ రెడ్డి, యుగంధర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

డోన్‌ను అభివృద్ధి పథంలో తీసుకెళ్తాం

- మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



డోన్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

డోన్ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): డోన్ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి పథంలో తీసుకెళ్తామని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. సోమవారం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో నిర్వహించిన మినీ మహానాడు కార్యక్రమానికి డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇటీవల ఆపరేషన్ సిందూరలో వీరమరణం పొందిన వీరజవాన్లను స్మరించుకుంటూ, నివాళులర్పించారు. అనంతర సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ డోన్ నియోజకవర్గ అభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన, వ్యవసాయాన్ని బలోపేతం చేయడమే తమ లక్ష్యాలన్నారు. గత వైసీపీ పాలకులు డోన్ నియోజకవర్గంలో కనీసం చెరువులు నింపే కార్యక్రమాన్ని కూడా పూర్తి చేయలేదన్నారు. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటు పడుతామని తెలిపారు. టీడీపీ కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉండి, వారికి ఏ సమస్య వచ్చినా పరిష్కరించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వలసల రామకృష్ణ, కోట్రికే ఫణిరాజ్, టీడీపీ మండల కార్యదర్శి శ్రీనివాసులు యాదవ్, సీనియర్ నాయకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డి, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, మాజీ సర్పంచ్ పెద్ద కేశవయ్యగౌడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, ఓంప్రకాష్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల నాయకులు తొప్పల శ్రీనివాసులు, ఆర్ఈ నాగరాజు, బుగ్గన ప్రసన్నలక్ష్మి, ఎల్లనాగయ్య, ఉన్నం చంద్రశేఖర్, పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



నూతన బాలాలయం



వెండి తొడుగులో వేంకటేశ్వరుడు

రుద్రవరం, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలం వాసాపురంలో వేంకటేశ్వరస్వామి బాలాలయం విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు వారణాసి గోపిశర్మ, తిరుమల తిరుపతి దేవస్థానం పండితులు శ్రీపాదదీక్షితుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీ స్వాములు కుంభాభిషేకం, విగ్రహ ప్రతిష్ఠ చేశారు. బాలాలయంలో వేంకటేశ్వరస్వామికి దాతలు వెండి తొడుగు బహుకరించారు. భరత నాట్యం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం పీఠాధిపతులు కమలానంద భారతీస్వాములు మాట్లాడుతూ ప్రజలు ఆధ్యాత్మికత వైపు నడువాలని సూచించారు. కొంత సమయాన్ని పూజ కోసం కేటాయించాలని సూచించారు. అనంతరం పీఠాధిపతిని ఆలయ కమిటీ చైర్మన్ మధుసూదనరెడ్డి, వైస్ చైర్మన్ రంగనాయకులు, కార్యదర్శి నరసింహులు సన్మానించారు.

సుందరయ్య ఆశయసాధనకు కృషి చేద్దాం



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

డోన్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, స్వాతంత్ర్య సమరయోధులు పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేద్దామని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ అన్నారు. సోమవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శివరాం, భాస్కర్ రెడ్డి, చిన్న రెహిమాన్, రామాంజనేయులు, నాగమద్దయ్య, అబ్దుల్ లతీఫ్, రామ్మూర్తి, అక్బర్‌బాషా, మాబాషా, నాగ చరణ్ పాల్గొన్నారు.

నేటి తరానికి ఆదర్శం

బేతంచెర్ల: నేటి తరం యువకులకు, రాజకీయ నేతలకు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శమని సీపీఎం నాయకుడు సుబ్బరాయుడు అన్నారు. సోమవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సాధిక్ హుశేన్, వై.ఎల్లయ్య, సీపీఎం మండల నాయకులు వైబీ వెంకటేశ్వర్లు మధుశేఖర్, రామాంజనేయులు, తిరుమలేష్, ఖాజా భాషా, గుల్జార్‌బీ, రామలక్ష్మి, నాగేంద్రమ్మ, మల్లి, సంజీవ నాయుడు, రెహంతుల్లా, ఎస్కే బాషా పాల్గొన్నారు.

ఘనంగా బీపీ శేషారెడ్డి జయంతి



బీపీ శేషారెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న బుగ్గన అర్జున్ రెడ్డి

బేతంచెర్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రజల కోసం విద్యా వైద్య ఆధ్యాత్మిక కేంద్రాల వ్యవస్థాపకులు బీపీ శేషారెడ్డి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో కర్నూలు నంద్యాల సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బీపీ శేషారెడ్డి విగ్రహానికి వైసీపీ నాయకుడు బుగ్గన అర్జున్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, వైసీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, ముర్తుజావలి, ఖాజా హుశేన్, బాబుల్ రెడ్డి, గుని నాగరాజు, మురళికృష్ణ, గోరుమాను కొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షుడు రంగస్వామి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్ ఇబ్రహీం, మండల కన్వీనర్ తిరుమలేశ్వరరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల బీపీ శేషారెడ్డి చిత్రపటానికి, విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రిన్సి పాల్ రాజశేఖర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ హెచ్‌వోడీ హేమంత్ కుమార్, ఐటీ ఐ, పాలిటెక్నిక్ కాలేజీ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ప్రశాంతత

డోన్ టౌన్: క్రీడలతోనే మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని వైసీపీ నాయకుడు బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి అన్నారు. సోమవారం శేషారెడ్డి 139వ జయంతిని పురస్కరించుకుని ఇండోర్ స్టేడియంలో షటిల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకు ముందుగా పట్టణంలోని పాతబస్టాండులోని స్వర్గీయ శేషారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్‌చైర్మన్ జాకీర్ హుశేన్, జడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్ యాదవ్, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

చింతకుంటలో కార్డన్ సెర్చ్



చింతకుంటలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐలు, పోలీసు సిబ్బంది

ఆళ్లగడ్డ, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి చింతకుంట గ్రామంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టౌన్ సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రౌడీషీటర్లు, అనుమానిత ప్రాంతాలు, అనుమానిత వ్యక్తుల ఇళ్లల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 22 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ నేరాలను నియంత్రించడమే లక్ష్యంగా గ్రామాల్లో సోదాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టౌన్ సిఐ మురళీదర్‌రెడ్డి, ఎస్ఐ నగీనా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో మానసిక ప్రశాంతత

కొలిమిగుండ్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషి నిత్యం భగవద్గీత పఠనం చేయటం ద్వారా ఆయురారోగ్యంతో పాటు, మానసిక ప్రశాంతత లభిస్తుందని త్రైత సిద్ధాంతం హిందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు పీహెచ్‌ఎం నాయుడు, పోరెడ్డి రామకృష్ణారెడ్డి, బాలయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో త్రైత సిద్ధాంతం భగవద్గీత పుస్తక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మండలంలోని ఇటిక్యాల గ్రామంలో ఇంటింటికి తిరిగి భగవద్గీత ప్రాధాన్యం వివరించారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

గిద్దలూరు ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం

సంజామల, మే 19(ఆంధ్రజ్యోతి): గిద్దలూరు ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఈవోపీఆర్డీ రాధికారెడ్డి సోమవారం తెలిపారు. ఉప సర్పంచ్‌గా తలారి సుబ్బన్నను ఏకగ్రీవంగా వార్డు సభ్యులు ఎన్నుకున్నారు. ఉపసర్పంచ్ సులోచన రాజీనామాతో ఎన్నిక నిర్వహించారు.

పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకోండి

చాగలమర్రి, మే 19 (ఆంధ్రజ్యోతి): గ్రామబిల్లో పండ్ల తోటల సాగు చేసుకునేందుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో ఖాసీం తెలిపారు. సోమవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వందశాతం సబ్సిడీతో రైతులకు మూడేళ్ల పాటు పండ్ల తోటలసాగుకు నిధులు వెచ్చించినట్లు చెప్పారు. 300 ఎకరాల్లో పండ్ల తోటలసాగు లక్ష్యం ఉందని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి

చాగలమర్రి, మే 19 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను విద్యార్థులు వినియోగించుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికారి రామచంద్రుడు తెలిపారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తకాల ఆవశ్యకత గురించి తెలియజేశారు. వేసవి సెలవులు కావడంతో ప్రతి విద్యార్థి గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానాన్ని పెంచే పుస్తకాలను చదవాలని సూచించారు. వివిధ పోటీలను నిర్వహించారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేదిక

చాగలమర్రి, మే 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రభుత్వం మండలస్థాయిలో ప్రజావేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రవి కుమార్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం మండలస్థాయి అధికారులచే సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకుముందు ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. సమావేశంలో ఈవో తాహిర్‌హుసేన్, ఎంఈవో న్యామతుల్ల, ఏవో రంగనేతాజీ, ఏఈలు కొండారెడ్డి, రమణయ్య, నరసింహరావు, ఏపీవో ఖాసీం, ఏపీఎం నాగమ్మ పాల్గొన్నారు.

సురక్షిత తాగునీరు అందించాలి

రుద్రవరం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతి గ్రామంలో సురక్షిత తాగునీరు ప్రజలకు అందించాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం మండలస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామాల్లో ఉన్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను శుభ్రం చేయించి సురక్షిత నీరు అందించాలన్నారు. ఇన్‌లైన్ క్లోరినేషన్‌పై అవగాహన కల్పించారు. ఏఈలు సుబ్రహ్మణ్యం, కమాల్‌సాబ్ పాల్గొన్నారు.

మట్టిమిద్దెలో ఉండకూడదు

రుద్రవరం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టిమిద్దెల్లో ఉండరాదని తహసీల్దారు మల్లిఖార్జునరావు సోమవారం అన్నారు. గ్రామాల్లో మట్టిమిద్దెల్లో ఉన్న వారికి నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. వర్షాలు కురుస్తుండడంతో మట్టిమిద్దెల్లో నివాసం ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంద న్నారు. ప్రతి ఒక్కరూ సురక్షిత నివాసాల్లో ఉండాలని సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

డోన్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు ఉన్న కారణంగా మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నాగమణి రైతులకు సూచించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు మట్టిమిద్దెలు, శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాల కారణంగా ఏదైనా ప్రమదాలు సంభవిస్తే తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో 9642439008, 8686336336, 760101197 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సచివాలయాల్లో సమయపాలన ఏది?



ముత్యాలపాడు సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

చాగలమర్రి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సచివాలయంలో ప్రజలకు సరైన సేవలు అందడం లేదన్న విమర్శలు ఉన్నాయి. సచివాలయ ఉద్యోగులు ఎప్పుడు వస్తారో వెళ్తారో తెలియడం లేదని పలువురు వాపోతున్నారు. సోమవారం ముత్యాలపాడు 1వ సచివాలయంలో 11 గంటలైన సచివాలయ ఉద్యోగులు రాకపోవడంతో ఖాళీ కుర్చీలు కనిపించాయి. రేషన్ కార్డుల దరఖాస్తుల కోసం వచ్చిన ప్రజలు సంబంధిత అధికారుల కోసం గంటల తరబడి నిరీక్షించి వెనుతిరిగారు. ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించేలా చూడాలని పలువురు కోరారు.

కౌలు వేలం ద్వారా రూ.24 లక్షల ఆదాయం

శిరివెళ్ల, మే 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటపాడు గ్రామంలోని ఆలయాలకు చెందిన 83.85 ఎకరాల భూములకు సోమవారం నిర్వహించిన బహిరంగ కౌలు వేలం ద్వారా రూ.24,09,500 ఆదాయం వచ్చినట్లు గ్రూపు దేవాలయాల ఈవో రామాంజనేయ శర్మ తెలిపారు. గత ఏడాది ఈ భూములకు రూ. 26,80,500 లక్షల ఆదాయం రాగా ఈ ఏడాది రూ.2.71 లక్షల ఆదాయం తగ్గిందన్నారు. నంద్యాల గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి గంటా వేణునాథరెడ్డి పర్యవేక్షణాధికారిగా వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అర్చకులు, దేవాదాయశాఖ సహాయకుడు మేరువ శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

బేతంచెర్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల శాఖ గ్రంథాలయంలో సమ్మర్ ఒరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ నిర్వహించారు. అలాగే చెస్, లౌడ్స్ డ్రాయింగ్ నేర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మధు శేఖర్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన గనులు లాంటివని, ప్రతిఒక్కరూ గ్రంథాలయాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు ఉన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి



స్మార్ట్‌మీటర్ బిగింపును అడ్డుకుంటున్న నాయకులు

బేతంచెర్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): ఇళ్లకు బిగించే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తే అడ్డుకోవాలని సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, మధుశేఖర్ అన్నారు. సోమవారం పట్టణంలో గౌరిపేట కాలనీలో స్మార్ట్ మీటర్లను బిగి స్తూ ఉంటే వాటిని సీపీ ఎం నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగిస్తే ప్రజలపై పెద్ద ఎత్తున భారం పడుతుందన్నారు. ఒకవేళ ఏర్పాటు చేస్తే మీటర్లను సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఖాజాభాషా, ప్రసాద్, రాజు, రామాంజనేయులు, టింగు, నాగరాజు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

డోన్ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కే.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జూన్ 5న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.